హెచ్ఐసీసీలో పెడల్ ఫర్ హెల్త్ సైక్లథాన్

మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా శనివారం పెడల్ ఫర్ హెల్త్ పేరిట ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారతప్రభుత్వ ఆరోగ్య మంత్రిత్వశాఖ, ఫెడల్ ఫర్ హెల్త్ సైక్లథాన్‌ను హ్యాపీ హైదరాబాద్, జీవైసీఎస్ ఇండియా, హైదరాబాద్ సైక్లింగ్ రివల్యూషన్ సహకారంతో నిర్వహించారు.

ఓయూ పరిధిలో రేపటి నుంచి పీజీ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో సోమవారం నుంచి వివిధ పీజీ కోర్సుల తరగతులు ప్రారంభం కానున్నాయి. వేసవి సెలవుల అనంతరం క్యాంపస్ కాలేజీలతో పాటు అనుబంధ, ప్రైవేట్ కళాశాలల్లోని ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ఇతర పీజీ కోర్సుల 2, 4 సెమిస్టర్లకు తరగతులు ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు.

పోస్టాఫీసులో ఆధార్ ప్రత్యేక కౌంటర్

షాద్‌నగర్: పట్టణంలోని పోస్టాఫీసులో ఆధార్ సేవలను అందించేందుకు శనివారం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తపాలా ఇన్‌స్పెక్టర్ జుబేర్ పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు సేవలను అందించనున్నట్లు చెప్పారు. కొత్తగా ఆధార్‌కార్డు పొందేవారు, పుట్టిన తేదీ, చిరునామా, ఫోన్ నంబర్లు మార్చుకోవాలనేవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

పెత్తందారుల చేతుల్లో దేశ సంపద

- మోదీ అధికారంలోకి వచ్చాక ప్రజలపై మోయలేని భారం
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

హయత్‌నగర్: ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై ధరల భారం మోపడమే కాకుండా దేశ సంపదను పెత్తందారుల చేతుల్లో పెడుతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ధ్వజమెత్తారు. మతం పేరుతో ప్రజల్లో సెంట్‌మెంట్‌ను రెచ్చగొట్టి పబ్బం గడుపుకొంటున్నారని అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని రావినారాయణరెడ్డి కాలనీలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే ఒడిశాలో రైలు ప్రమాదం జరిగిందని, దీనికి బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి రాజీనామా చేయాలన్నారు. మృతులకు ఒక్కొక్కరికి రూ.కోటి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మేదీ నిరంకుశ పాలనను అంతమొందించాలంటే వామపక్ష పార్టీలతో పాటు బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీలను కలుపుకొని పోవాలన్నారు. రాష్ట్రంలో పేదలకు ఇళ్ల స్థలాలు సాధించే వరకు అండగా ఉంటామని నారాయణ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, కార్యదర్శివర్గ సభ్యుడు ఈటీ నర్సింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, కౌన్సిల్ సభ్యుడు మత్యాల యాదిరెడ్డి, రాష్ట్ర ప్రజానాట్యమండలి కార్యదర్శి పల్లె నర్సింహ, జిలా కార్యవర్గ సభ్యుడు సామిడి శేఖర్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లలో గణనీయమైన ప్రగతి

రాష్ట్ర రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి విజయేందిర బోయి



మాట్లాడుతున్న విజయేందిర బోయి

మొయినాబాద్: తెలంగాణ ఏర్పడిన తొమ్మిదేళ్లలో వ్యవసాయంతోపాటు అన్ని రంగాల్లో రాష్ట్రం గణనీయమైన ప్రగతి సాధించిందని రాష్ట్ర రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి విజయేందిర బోయి అన్నారు. మొయినాబాద్ రైతు వేదిక వద్ద మండల వ్యవసాయాధికారి రాగమ్మ ఆధ్వర్యంలో శనివారం రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో రాష్ట్రం దేశానికే దిక్సూచిగా మారిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ తిరుపతిరావు, ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, వైస్ ఎంపీపీ మమత, పీఏసీఎస్ జిల్లా సీఈఓ శ్రీనివాస్, తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీడీఓ సంధ్య, డీటీ వినయ్‌సాగర్, ఆర్ఐ పాండు, ఏఈఓ సునీల్, సర్పంచ్‌లు స్వరూప, రత్నం, ఎంపీటీసీలు శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, ఏపీఎం రవీందర్, సూపరింటెండెంట్ సులోచన, ఏఎంసీ డైరెక్టర్లు భిక్షపతిగౌడ్, రాము తదితరులు పాల్గొన్నారు.

నిప్పుల కొలిమి

రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

సాక్షి, సిటీబ్యూరో: సూరీడు నిప్పులు కురిపిస్తున్నాడు. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఉదయం 7 గంటల నుంచే ఎండల తీవ్రత దడ పుట్టిస్తోంది. భగభగలతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వేడిమితో ఇంటా.. బయటా ఇబ్బందులు తప్పడం లేదు. ఉద్యోగాలకు, అత్యవసర పనులకు ఇళ్ల నుంచి వెళ్తున్న వారు తిరిగి వచ్చేసరికి అస్వస్థతకు గురవుతున్నారు. రోడ్ల వెంట తోపుడు బండ్లపై పండ్లు, కూరగాయలు విక్రయించే చిరువ్యాపారులు ఎండల ధాటికి విలవిల్లాడుతున్నారు. వేసవికాలం ముగుస్తున్న తరుణంలో ఎండలు భగ్గుమంటున్నాయి. నైరుతి రుతుపవనాలు మరో వారం, పది రోజుల్లో రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నప్పటికీ.. ఎండల ప్రభావం ఏ మాత్రం తగ్గడం లేదు. శనివారం గరిష్ఠ ఉష్ణోగ్రత 42.4, కనిష్ఠ ఉష్ణోగ్రత 30 డిగ్రీలుగా నమోదైంది. ఈ వేసవిలో అత్యధికంగా సగటు ఉష్ణోగ్రత నమోదు కావడం ఇదే తొలిసారి. మొత్తం మీద సాధారణ ఉష్ణోగ్రత కంటే 3.5 డిగ్రీలు అధికంగా నమోదైంది.

చెత్త తొలగేలా.. స్వచ్ఛత పెరిగేలా..

- మున్సిపాలిటీల్లో వినూత్న కార్యక్రమం
- నిరుపయోగ వస్తువుల సేకరణకు 'ఆర్ఆర్ఆర్'
- ఈనెల 5వ తేదీ వరకు అందుబాటులో ప్రత్యేక కేంద్రాలు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



కొత్తూరు మున్సిపాలిటీలో ఆర్ఆర్ఆర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్, అధికారులు (ఫైల్)

కొత్తూరు: నగరాలు, పట్టణాల్లో స్వచ్ఛత కోసం కేంద్ర ప్రభుత్వం మేరా లైఫ్.. మేరా స్వచ్ఛ షెహర్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా గతనెల 20 నుంచి ఈనెల 5వ తేదీ వరకు జిల్లాలోని మున్సిపాలిటీల్లో రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రజలకు అవగాహన కల్పించి ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న సామగ్రిని సేకరిస్తున్నారు. జిల్లాలోని 14 మున్సిపాలిటీలు, 12 కార్పొరేషన్ల పరిధిలో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. జనాభా ప్రాతిపదికన కొన్ని మున్సిపాలిటీల్లోని వార్డుల్లో సైతం ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

సేకరించే వస్తువులు, వివరాల నమోదు

పునర్వినియోగానికి ఉపయోగపడే సామగ్రి, వస్తువులన్నింటినీ ప్రజలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. సామగ్రిని ఇచ్చే వారి పేరు.. ఫోన్ నంబర్.. ఇంటి నంబర్లను రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు 15 రోజుల పాటు ఆర్ఆర్ఆర్ కేంద్రాల నిర్వహణను చూసేలా ఏర్పాట్లు చేశారు. వచ్చే వస్తువుల్లో అవసరమైన వాటిని తిరిగి కొందరికి ఉచితంగా ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. పర్యవేక్షణ కోసం వార్డు అధికారులను ప్రత్యేకంగా నియమించారు. ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్, వంట సామగ్రి, పుస్తకాలు, పేపర్లు, పాత దుస్తులు, పాదరక్షలు, ఇనుప సామగ్రి, పరుపులు, దిండ్లు, కుర్చీలు, మంచాలు, పాలిథిన్ వ్యర్థాలను కేంద్రాల ద్వారా సేకరిస్తున్నారు. ఈ నెల 5వ తేదీ వరకు వ్యర్థాలను సేకరించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించడానికి వార్డు అధికారి, కౌన్సిలర్, ఆర్పీ, మహిళా సంఘాల సభ్యులు, పారిశుద్ధ్య కార్మికులు, వలంటీర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. కార్యక్రమం అనంతరం అవసరం ఉన్న మున్సిపాలిటీల్లో శాశ్వత ఆర్ఆర్ఆర్ కేంద్రాలను నిర్వహించేందుకు పురపాలకశాఖ అధికారులు పరిశీలిస్తున్నారు.



నిరుపయోగ వస్తువులు సేకరిస్తున్న సిబ్బంది

జాతీయ, రాష్ట్రస్థాయిలో అవార్డులు

ఆర్ఆర్ఆర్ కార్యక్రమంలో భాగంగా అత్యధికంగా వస్తువులు, సామగ్రిని సేకరించిన మున్సిపాలిటీలకు కేంద్రం జాతీయ, రాష్ట్రస్థాయిలో అవార్డులను అందజేస్తుంది. మున్సిపాలిటీస్థాయిలో వస్తువులు అధికంగా సేకరించిన వార్డును సైతం అవార్డులు వరించనున్నాయి.

ప్రజలు సహకరించాలి



ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆర్ఆర్ఆర్ కేంద్రాల ద్వారా వ్యర్థాల సేకరణ కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలి. అందరూ బాధ్యతగా భావించి ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న వస్తువులు, సామగ్రిని అందించాలి. ఎక్కువ వస్తువులు అందించి మున్సిపాలిటీకి జాతీయ స్థాయిలో గుర్తింపు, అవార్డులు రావడానికి కృషి చేయాలి.

– వీరేందర్, మున్సిపల్ కమిషనర్, కొత్తూరు

అవగాహన కల్పిస్తున్నాం



మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్, మంచాలు, పాత దుస్తులు, పాదరక్షలను ఆర్ఆర్ఆర్ కేంద్రాల్లో ఇవ్వాలి. దీని ద్వారా మున్సిపాలిటీల్లో వ్యర్థాలు తగ్గడంతో పాటు మరికొందరికి మేలు చేకూరుతుంది. ప్రజలు, వ్యాపారులు కార్యక్రమం విజయవంతానికి తమవంతు సహకారం అందించాలి.

– లావణ్య, మున్సిపల్ చైర్‌పర్సన్, కొత్తూరు



మహేశ్వరం: రైతులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న మంత్రి సబితారెడ్డి, కలెక్టర్ హరీశ్

రైతన్నకు పెద్దపీట

- 24 గంటల ఉచిత విద్యుత్ ఘనత మాదే
- పాలమూరు–రంగారెడ్డిని పూర్తి చేసి జిల్లాకు సాగు నీరందిస్తాం
- రైతు దినోత్సవంలో మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో రైతన్నకు పెద్దపీట వేసినట్లు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. మండల పరిధిలోని దుబ్బచర్ల రైతు వేదికలో మండల రైతుబంధు కమిటీ అధ్యక్షుడు పరిగి రాఘవేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రైతు దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి జిల్లాకు సాగు నీరందించేందేకు ముఖ్యమంత్రి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. పట్టా పాసు పుస్తకం కలిగిన ప్రతి రైతుకు ఎకరానికి రూ.5 వేల చొప్పున రెండు పంటలకు రూ.10 వేల పెట్టుబడి సాయంతో పాటు బీమా చేయించుకున్న రైతు సాధారణ, ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల బీమా అందిస్తున్నట్టు తెలిపారు. రుణమాఫీ, ఎరువులు, నాణ్యతతో కూడిన విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ట్రాక్టర్ల పంపిణీ చేపట్టినట్టు చెప్పారు. కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ.. రైతులు అసైన్డ్ భూములను సాగు చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. పదేళ్ల కాలంలో వ్యవసాయ రంగంలో ఎంతో పురోగతి సాధించామన్నారు. సభ ముగిసిన అనంతరం రైతులు, కలెక్టర్, అడిషనల్ కలెక్టర్‌కు మంత్రి స్వయంగా భోజనం వడ్డించి వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రతీక్ జైన్, కందుకూరు ఆర్డీఓ సూరజ్ కుమార్, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖ అధికారులు గీతారెడ్డి, సునంద, అంజిలప్ప, ఏపీసీ అంజయ్య, మహేశ్వరం ఏడీఏ సుజాత, దుబ్బచర్ల సర్పంచ్ ఎరువా స్లీవారెడ్డి, ఎంపీటీసీ సువర్ణరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ ఆనందం, జిల్లా రైతు కమిటీ సభ్యుడు కూన యాదయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాచులూరు రైతు వేదిక వద్ద ..

కందుకూరు: ప్రపంచంలోనే అతి పెద్దది అయిన కాళేశ్వరం ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని రాచులూరు రైతు వేదిక వద్ద శనివారం రైతులకు భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. రైతే ముఖ్యమంత్రిగా ఉంటే రైతులకు ఎంత లాభమో తెలంగాణ రైతులను చూస్తే తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూరజ్‌కుమార్, ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైస్ చైర్మన్ విజేందర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో పెనుమార్పులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

మహేశ్వరం: తెలంగాణ ఏర్పాటైన తర్వాత వ్యవసాయ రంగంలో పెనుమార్పులు సంభవించాయని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగారం రైతు వేదికలో శనివారం నిర్వహించిన రైతు దినోత్సవంలో ఆమె మాట్లాడారు. ఏ రాష్ట్రంలోలేని రైతు సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్ రైతు బాంధవుడని కొనియాడారు. పదేళ్లలో వ్యవసాయం, వాటి అనుబంధ రంగాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునితా నాయక్, పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, నాగారం, నందుపల్లి, పడమటి తండా, నాగిరెడ్డిపల్లి, మన్సాన్‌పల్లి, చిన్న తూప్ర గ్రామాల సర్పంచ్‌లు లావణ్య, కళావతి, అనితా నాయక్, మనోహర్, అరుణ, రఘుపతి, నాగారం, గొల్లూరు ఎంపీటీసీ సభ్యులు కుండె వెంకటేష్, నడికూడ రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కె.రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి రాజు నాయక్, మర్యాద రాఘవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలొచ్చాయ్

- సర్కారు బడులకు సరఫరా
- ప్రైవేట్‌లో అమ్మకాలు జోరు

సాక్షి, సిటీబ్యూరో: పాఠశాలలు పునఃప్రారంభం గడువు సమీపిస్తుండటంతో పాఠ్యపుస్తకాల సందడి ప్రారంభమైంది. ఇప్పటికే కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అమ్మకాలు సాగిస్తుండగా.. సర్కారు బడులకు సైతం పాఠ్యపుస్తకాల సరఫరా ప్రారంభమైంది. బడులు పునఃప్రారంభమయ్యే తొలిరోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించే విధంగా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ప్రిటింగ్ ప్రెస్ నుంచి గోదాముకు పాఠ్య పుస్తకాల స్టాక్ రావడంతో మండల స్థాయి పాయింట్లకు సరఫరా చేసి అక్కడి నుంచి స్కూల్ పాయింట్లకు సంబంధించి పాఠశాల బాధ్యులకు పుస్తకాల ఇండెంట్ అందిస్తున్నారు.

21 లక్షల మందికిపైనే..

గ్రేటర్‌లోని రంగారెడ్డి– మేడ్చల్ జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ విద్యా సంస్థలు సుమారు 7,587 ఉండగా, అందులో ఒకటి నుంచి 10 వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల సంఖ్య సుమారు 21 లక్షల మందికిపైగా ఉన్నారు. ఇందులో మూడు లక్షల వరకు విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నట్లు విద్యాశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రైవేటు విద్యా సంస్థలను మినహాయిస్తే కేవలం హైదరాబాద్–రంగారెడ్డి–మేడ్చల్ జిల్లా పరిధిలోని ప్రభుత్వ బడుల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సుమారు 23.50 లక్షల పాఠ్య పుస్తకాలు అవసరం. ఇప్పటికే గోదాములకు సగానికి పైగా పాఠ్యపుస్తకాలు వచ్చి చేరగా సరఫరా ప్రారంభమైంది.

ప్రైవేటులో ధరల దరువు..

ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్య పుస్తకాల ధరలు దడపుటిస్తున్నాయి. కేవలం ప్రాథమిక తరగతుల్లో తెలుగు వాచకం, హిందీ ప్రతిమాల, న్యూజెమ్స్ ఇంగ్లిష్ రీడర్, మ్యాథమెటిక్స్ రియల్ లైఫ్, సైన్స్ ఎక్స్‌ప్లోరర్, సోషల్ ఫుట్ ప్రింట్, క్యూ నాలెడ్జ్, కంప్యూటర్ ప్రో, ఈఎస్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ పుస్తకాలతో పాటు జీప్ లాక్ ఫైల్–1, టెక్స్ బుక్స్ కవర్స్, నోట్ బుక్స్ కవర్స్, పెన్సిల్ బాక్స్, 18 నుంచి21 వరకు నోట్స్ బుక్స్ కలిపి కొనాల్సిందే. వీటి ధరలకు అడ్డూఅదుపూ లేకుండా ఉన్నాయి. ఇక ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల స్థాయిలో మ్యాథ్స్ , ఫిజిక్స్, కెమెస్ట్రీ, బయాలజీ ఎక్స్‌ప్లో, తెలుగు, హిందీ. ఇంగ్లిష్, సోషల్, మ్యాప్ పెయింటింగ్, జీకే, కంప్యూటర్ ప్రో, నోట్‌బుక్స్ కవర్స్, స్మాల్ కవర్స్, నోట్‌బుక్స్ కలిపి సగటున రూ.3 వేల నుంచి రూ.4,వేల మోత మోగుతోంది. వీటికి తోడు స్టేట్ సెలబస్ ఫస్ట్, సెకండ్ లాంగ్వేజ్, ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్, ఫిజిక్స్, బయాలజీ, సోషల్ సబ్జెక్టు పాఠ్యపుస్తకాలకు సైతం అదనంగా బాదేస్తున్నాయి.

అకాడమీల మాటున అక్రమ దందా!



- జేఈఈ, నీట్, ఎంసెట్ ర్యాంకుల ఆశచూపి దోపిడీ
- ఇంటర్ బోర్డు అనుమతి లేదు.. ఫీజులపై నియంత్రణ లేదు
- విద్యార్థులు అకాడమీలో.. అడ్మిషన్లు ఇతర కాలేజీల్లో
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఇంటర్మీడియెట్ అధికారులు

ఇంటర్ కాలేజీకి బోర్డు గుర్తింపు తప్పనిసరి. సెక్షన్ల వారీగా బోర్డుకు కొంత ఫీజు చెల్లించాలి. విద్యార్థుల నిష్పత్తికి తగినన్ని తరగతి గదులు, లైబ్రరీ, ప్రయోగశాల, క్రీడామైదానం, అర్హులైన అధ్యాపకులు, భవనానికి మున్సిపాలిటీ, ఫైర్ ఎన్ఓసీలు తప్పనిసరి. ఆ తర్వాత కూడా ప్రభుత్వ శాఖల అజమాయిషీలో పనిచేయాలి. అదే అకాడమీ అయితే ఇవేవీ అవసరం లేదు. రెండు మూడు తరగతి గదులు, నలుగురైదుగురు అధ్యాపకులు ఉంటే చాలు. జిల్లాలోని పలు ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు దీన్ని అనువుగా ఎంచుకుంటున్నాయి. బయట అకాడమీ బోర్డు తగిలించి లోపల ఇంటర్మీడియట్ క్లాసులు బోధిస్తున్నాయి. తీరా పరీక్షల సమయంలో ఇతర కాలేజీ నుంచి హాల్ టికెట్లు జారీ చేయించి పరీక్షకు ఇటు విద్యార్థుల తల్లిదండ్రులను, అటు బోర్డును మోసం చేస్తున్నాయి.

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలోని పలు ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థలు కొత్త దందాకు తెరతీశాయి. అకాడమీల మాటున అడ్మిషన్లు సేకరిస్తున్నాయి. తీరా పరీక్షల సమయం దగ్గర పడిన తర్వాత ఇతర కాలేజీల నుంచి హాల్ టికెట్లు జారీ చేస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా క్లాసులు నిర్వహిస్తున్నాయి. విద్యార్థుల నుంచి రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ ఇటు విద్యార్థుల తల్లి దండ్రులను, అటు ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులను బురిడీ కొట్టిస్తున్నాయి. కొండాపూర్, మాదాపూర్, నార్సింగి, అయ్యప్ప సొసైటీ, చైతన్యపురి, ఎల్బీనగర్, భాగ్యలత, వనస్థలిపురం, ఆదిబట్ల కేంద్రంగా ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. అధికారులు వాటికి తాత్కాలికంగా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకొంటున్నారు.

బోర్డుమీద ఒకటి..బ్రోచర్‌లో మరొకటి

జూనియర్ కాలేజీ అని పేరు పెట్టుకుంటే దానికి ఇంటర్ బోర్డు అనుమతులు, తనిఖీలు, గుర్తింపు ఫీజు చెల్లించాలి. ఒక్కోదానికి రూ.3 లక్షలకుపైగా ఖర్చవుతుంది. దానికితోడు సెక్షన్లను బట్టి అధ్యాపకులు, ఇతర సిబ్బందిని చూపించాల్సి ఉంది. వీటిని తప్పించుకునేందుకు అకాడమీల పేరు పెట్టుకుని కొన్ని కళాశాలలు యథేచ్ఛగా ఇంటర్ విద్యను అందిస్తున్నాయి. దీంతో ఇంటర్ బోర్డు ఏటా రూ.కోట్లలో నష్టపోవాల్సి వస్తోంది. ఇలా ఒక్క అయ్యప్ప సొసైటీలోనే 15 అకాడమీలు కొనసాగుతున్నాయంటే ఆశ్చర్యపోనవసరం లేదు. నిజానికి వీటిలో ఉదయం, సాయంత్రం సబ్జెక్టుల వారీగా ట్యూషన్లు, పోటీ పరీక్షలకు కోచింగ్‌లు మాత్రమే ఇవ్వాల్సి ఉంది. కానీ జిల్లాలోని పలు అకాడమీలు నీట్, జేఈఈ , ఎంసెట్ ర్యాంకుల ఆశచూపి అడ్డగోలు వ్యవహారానికి పాల్పడుతున్నాయి. ఎవరికి అనుమానం రాకుండా బిల్డింగ్‌పై అకాడమీ బోర్డు తగిలించి..లోపల మాత్రం గుట్టుగా ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహిస్తున్నాయి. తీరా వార్షిక పరీక్షలు సమీపించే సమయానికి హాల్ టికెట్లు ఇతర కాలేజీ నుంచి జారీ చేయిస్తున్నాయి. అదేమని అడిగితే అది కూడా తమ కాలేజేనని బుకాయిస్తుండటం గమనార్హం.

ఒత్తిడికి తట్టుకోలేక మృత్యువాత

ఈ అకాడమీల్లో శిక్షణ పొందిన విద్యార్థులు సాధించిన ర్యాంకులను బూచీగా చూపించి.. అమాయక విద్యార్థుల నుంచి అడ్మిషన్లు సేకరిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా పీఆర్‌ఓలను, మార్కెటింగ్ బృందాలను సైతం నియమించుకోవడం విశేషం. ఫలితాలు రాకముందు, కాలేజీలు తెరుచుకోక ముందే అడ్మిషన్లు తీసుకున్న వారికి ఫీజుల్లో 20 నుంచి 30 శాతం రాయితీలు ప్రకటిస్తున్నాయి. ఎల్బీనగర్‌లోని ఓ అకాడమీ కేవలం మెడికల్ కోర్సులకు శిక్షణ ఇస్తుండగా, భాగ్యలత సమీపంలోని మరో అకాడమీ కేవలం ఇంజనీరింగ్ కోర్సులకు శిక్షణ ఇస్తున్నాయి. కొండాపూర్, మాదాపూర్, అయ్యప్పసొసైటీ, గండిపేట కేంద్రంగా కొనసాగుతున్న పలు కార్పొరేట్ అకాడమీలు ర్యాంకుల వేటలో పడి విద్యార్థులతో అమానుషంగా ప్రవరిస్తున్నాయి. ఒత్తిడి తట్టుకోలేక పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గత విద్యా సంవత్సరం నార్సింగి కేంద్రంగా పని చేస్తున్న ఓ ప్రముఖ రెసిడెన్షియల్ అకాడమీలో షాద్‌నగర్‌కు చెందిన ఓ విద్యార్థి అనుమానాస్పదంగా మృతి చెందడం సంచలనంగా మారింది.

చర్యలు తీసుకోవాలి

అకాడమీలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అనుమతుల్లేని భవనాల్లో అకాడమీల పేరుతో ఇంటర్ క్లాసులు బోధిస్తున్నారు. ఫీజు వసూళ్లపై నియంత్రణ లేకుండా పోతోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– మాసారం ప్రేమ్‌కుమార్, అధ్యక్షుడు, సీజేఎస్

మా దృష్టికి రాలేదు

అకాడమీల పేరుతో ఇంటర్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదు. అలాంటి యాజమన్యాలపై చర్యలు తీసుకుంటాం. గుర్తింపు ఉన్న కాలేజీల్లోనే విద్యార్థులను చేర్పించాలి. యాజమాన్యాల మాయమాటలు నమ్మి మోసపోవద్దు.

– వెంక్యనాయక్, జిల్లా ఇంటర్ బోర్డు అధికారి

ఆర్టీఏ ప్రత్యేక నంబర్లపై వాహనదారుల క్రేజ్

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీఏ ప్రత్యేక నంబర్లపై వాహనదారులు మరోసారి క్రేజ్‌ను చాటుకున్నారు. శనివారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో ప్రత్యేక నంబర్లపై జరిగిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు అనూహ్యమైన స్పందన లభించింది. శనివారం ఒక్కరోజే రూ.35,62,691 ఆదాయం లభించింది. టీఎస్ 09 జీబీ 9999 నంబర్ కోసం అస్పైర్ హోమ్స్ అండ్ ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో రూ.9 లక్షలు చెల్లించి సొంతం చేసుకుంది. టీఎస్ 09 జీసీ 0009 నంబర్ కోసం ఏహెచ్ఎస్ ఆర్ట్ హోమ్స్ స్టూడియో ఎల్ఎల్‌పీ సంస్థ రూ.8,90,000 చెల్లించి నంబర్‌ను దక్కించుకుంది. టీఎస్ 09 జీసీ 0001 నంబర్ కోసం జ్యోతి సుప్రియ అనే వాహన యజమాని రూ.2,62,113 చెల్లించారు. టీఎస్ జీసీ 0006 కోసం నామాల పురుషోత్తమరావు అనే వాహనదారు ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో రూ.2,16000 చెల్లించారు. టీఎస్ 09 జీసీ 0005 నెంబర్ కోసం కమలేష్ గ్రూప్ ఆఫ్ రెస్టారెంట్స్ అండ్ కేఫ్ రూ.1,45,555 చెల్లించింది. మరో నంబర్ టీఎస్ జీసీ 0007 కోసం చోటానాయుడు కామిరెడ్డి రూ.1,11,112 చెల్లించారు. టీఎస్09 జీసీ 0004 కోసం ఎస్‌కే కార్ లాంజ్ రూ.1,06,001 చెల్లించింది.

ఐదంతస్తుల భవనం పైనుంచి దూకి..


లలిత మృతదేహం

- వివాహిత ఆత్మహత్య
- కుటుంబ కలహాలే కారణమా?
- శంకర్‌పల్లిలో ఘటన

శంకర్‌పల్లి: కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఐదంతస్తుల భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన శంకర్‌పల్లిలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం దేవరంపల్లికి చెందిన జనార్దన్‌రెడ్డి, లలిత(లాస్య) (35) దంపతులు. రెండు నెలలుగా శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలోని రెడ్డి కాలనీలో అద్దెకు ఉంటున్నారు. ఇటీవల దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఉక్కపోత ఎక్కువగా ఉండటంతో భవనం పైకి వెళ్లారు. అందరూ అక్కడే నిద్రించారు. కాగా తెల్లవారుజామున లలిత భవనంపై నుంచి దూకింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ కలహాలే కారణమై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణ తెలిపారు.

డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి.. యువకుడి అదృశ్యం


మహేశ్ (ఫైల్)

పహాడీషరీఫ్: డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మామిడిపల్లి ముదిరాజ్ కాలనీకి చెందిన ఇస్లావత్ నందిని, మహేశ్ (21) దంపతులు. గత నెల 31న డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన మహేశ్ తిరిగి రాలేదు. అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య నందిని శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో కానీ, 87126 62367 నంబర్‌కు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

ఎద్దులను తరలిస్తున్న డీసీఎం పట్టివేత



కొత్తూరు: పట్టణంలోని వై జంక్షన్ కూడలీ జాతీయ రహదారిపై శనివారం స్థానిక పోలీసులు ఎద్దులను తరలిస్తున్న డీసీఎంను పట్టుకున్నారు. ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాల మేరకు కూడలీలో తనిఖీలు నిర్వహిస్తుండగా పరిమితికి మించి ఓ డీసీఎం వ్యాన్‌లో 17 ఎద్దులను తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం వాటిని సమీపంలోని గోశాలకు తరలించినట్లు వివరించారు. అనుమతులతోనే ఎద్దులను తరలిస్తున్నారా? లేదా అనే విషయాలను విచారణ అనంతరం తెలుస్తుందన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


వివాహ వేడుకలో ఏపీ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీమోహన్

వివాహ వేడుకలో ఏపీ ప్రిన్సిపల్ సెక్రటరీ

కడ్తాల్: మక్తమాధారంలోని వైఎస్ఆర్ గార్డెన్‌లో అర్కోటం నర్సింహ- శ్యామల దంపతుల కూతురు స్వప్న-రమేశ్‌ల వివాహం శనివారం జరిగింది. వివాహ వేడుకలకు ఏపీ ప్రిన్సిపల్ సెక్రటరీ (క్రీడలు, యువజన సేవలు) యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం, కల్చర్ డిపార్ట్‌మెంట్ అధికారి జి.వాణీమోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, రైతు నాయకులు బాల్‌రాజ్ ఉన్నారు.

యువకుడి రిమాండ్

శంకర్‌పల్లి: ప్రేమ పేరుతో యువతిని వంచించిన యువకుడిని శనివారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన నారేగూడెం కార్తిక్‌రెడ్డి తమ ఇంట్లో అద్దెకు ఉంటున్న యువతిని ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పాడు.పలు మార్లు శారీరకంగా కలిశాడు. దీంతో అమ్మాయి గర్భం దాల్చింది. ఇటీవల మగ బిడ్డకు జన్మనిచ్చింది. పెళ్లి చేసుకోవాలని బాధితురాలు కార్తిక్‌రెడ్డిని కోరగా నిరాకరించాడు. దీంతో యువతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.